కథానిక

# పత్నీభాగం

పెద్ది పార్వతీదేవి

"ఇందిరా! నాన్నగారికి చాలా సీరియస్‌గా ఉందట." కంగారుగా వచ్చాడు విష్ణుమూర్తి.

"మనం ఇప్పుడే గూడెం వెళ్లాలి. అమ్మ చాలా కంగారుపడుతుంది. నేను వెళ్లి నానిగాడిని స్కూలు నుంచి తీసుకొస్తాను. నువ్వు రెడీగా ఉండు!" అంటూ గబగబా మెట్లు దిగిపోతున్న విష్ణుమూర్తి "ఆగండి" అని ఇందిర పెట్టిన కేకతో ఆగిపోయాడు.

"నానిగాడిని తీసుకురావద్దు. నేను రాను. ఒక్కరే వెళ్లండి. అస్తమానం ఈ సీరియస్సులతో... డబ్బులు ఖర్చు శ్రమ. శ్రమ. నేను రాలేను" గట్టిగా చెప్పింది ఇందిర.

"ఈ ఒక్కసారి నా మాట విను." శాంతంగా అన్నాడు విష్ణుమూర్తి.

"సారీ మేం మాత్రం రాము!" అంది ఇందిర.

"నానిని చూడకుండా నాన్న ఉండలేరు. వెళ్లగానే ఆయన అడుగుతారు నానిగాడు రాలేదా అని."

"నానిగాడు నా కొడుకు. మీరు ఆయన కొడుకు."

ఇది గాలివాన అయ్యేట్లు ఉంది అనుకుంటూ ఒక్కడే బయలుదేరి ఆఖరు బస్సు అందుకోగలిగాడు మూర్తి.

బస్సు బయలుదేరింది – ఏవేవో పిచ్చి ఆలోచనలతో బస్సు కన్నా వేగంగా మనస్సు పరుగిడుతున్నది. నాన్న బాగుంటే అదే చాలు. అమ్మ పసుపు కుంకుమ చల్లగా ఉండాలి. అమ్మ ఎప్పుడూ కళకళ లాడుతూనే ఉండాలి అని కోరుకున్నాడు విష్ణుమూర్తి.

వీధి గుమ్మంలో రిక్షా దిగిన కొడుకును కామేశ్వరమ్మ తలెత్తి చూసింది. "వచ్చావా పెద్దోడా?" అని ఆప్యాయంగా దగ్గరికి వచ్చింది.

"నాన్నగారికి ఎలా ఉందమ్మా?" ఆత్రంగా అడిగాడు.

"ఏదోరా.. కొంచెం గుండెల్లో నొప్పి వచ్చింది. ఎంతో హడావిడి చేశారు. పిల్లల్ని చూస్తే ధైర్యంగా ఉంటుందని మీ కందరికీ నేనే కబురు చేశాను. అంతే!" ఏదో దాస్తున్నట్లు చెప్పిం దావిడ.

"ఈ మారు హైదరాబాదు తీసుకువెళ్లి అన్ని పరీక్షలూ చేయిస్తాను అమ్మా" అని ధైర్యం చెప్పి లోపలికి నడిచాడు మూర్తి.

కాఫీ ఇచ్చింది మూర్తికి. కాఫీ తాగి స్నానానికి వెళ్లాడు మూర్తి. దారిలోనే తండ్రిని పలకరించాడు.

ఇందిరా, పిల్లాడు రాలేదేం అని తండ్రి అడుగుతాడని తప్పించుకుని బాత్‌రూమ్‌లోకి స్నానానికి వెళ్లిపోయాడు.

కామేశ్వరమ్మ పాలగ్లాసు తెచ్చి మూర్తి చేతిలో పెట్టింది. కొంగున కట్టిన మాత్తర్లు రెండు ఇచ్చి "ఒరే విష్ణూ! ఈ మాత్తర్లు మింగించి మీ నాన్న చేత పాలు తాగించు. రోజూ ఈ మందులు వేసుకోడానికి ఒక యజ్ఞం చేయిస్తున్నారు. మందులు సరిగ్గా వేసుకుంటే ఈపాటికి లేచి తిరిగేవారు" అంటూ నిట్టూర్చింది తల్లి.

కొన్ని రోజులుగా నిద్రాహారాలు మరిచిపోయి భర్త సేవలతో అలిసిపోయిన కామేశ్వరమ్మగారికి బాగా నిద్రపట్టేసింది.

"పాపం... అమ్మ బాగా అలిసిపోయింది. నేను ఇంకా సెలవు పొడిగించి ఉంటే అమ్మకి కాస్త విశ్రాంతి లభిస్తుందని, అనుకుంటూ తల్లి ఇచ్చిన మాత్రలు, పాల గ్లాసుతో తండ్రి మంచం దగ్గరకి వెళ్లాడు విష్ణుమూర్తి.

పరమేశ్వరంగారు బాధతో మూలుగుతున్నారు. "నాన్నగారూ!" పిలిచాడు విష్ణుమూర్తి.

"ఒరే విష్ణూ! మీ అమ్మ ఎన్నో నోములు, పూజలు చేసింది. ఆవిడ ముత్తయిదువుగా" అంటూ కొంచెం నీళ్లు కావాలని సైగ చేస్తూ ఆయాసపడుతున్నారు.

మూర్తి వెళ్లి నీళ్లు తెచ్చేలోపల నీళ్లతో అవసరం లేకుండాపోయింది ఆయనకి.

"అమ్మా!" అని పెద్ద కేక వేశాడు మూర్తి. నిద్రలో ఉన్న కామేశ్వరమ్మ ఒక్క ఉదుటున పరిగెత్తుకొచ్చింది.

ఊ రంతా పరమేశ్వరంగా రింటి ముందు చేరారు. అందుకు కారణం ఆయన మంచితనమే.

సునాయస మరణం. ఎంతటి వారికి వస్తుంది. పువ్వులా ఎగిరిపోయారు. ఎవ్వరినీ కష్టపెట్టలేదు. అదృష్టవంతుడు... అంటూ కామేశ్వరమ్మని అంతమందీ ఓదార్చారు. చుట్టాలంతా వచ్చారు. జరగవలసిన కార్యక్రమాలన్నీ యాంత్రికంగా జరిగిపోయాయి. కామేశ్వరమ్మ ఏడ్చి ఏడ్చి ఒక మూలగా కొంగుపరచుకుని పడుకుంది.

కొడుకులు, కోడళ్లు, కూతురు మీనాక్షి, అల్లుడు రాఘవరావు అసలు విషయంపై చర్చలు ప్రారంభించారు.

"ఈ ఊళ్లో నాన్నగారు బాగా పే రున్న మనిషి. ఆయన కర్మకాండ ఘనంగా చేయాలి. దానాలు, ధర్మాలు, సంతర్పణా బాగా చేయాలి" అన్నాడు విష్ణుమూర్తి.

"నాకు వీటి మీద నమ్మక లే దన్నయ్యా!" అన్నాడు మధుసూదన్.


"మూఢాచారాలతో ఉన్న డబ్బు దులుపుకోవడం తప్ప వచ్చేది ఏమీ లేదు." అన్నాడు ప్రకాశ్ – పెద్ద కోడలు కూడా ఆ మాటలను సమర్థించింది.

ఇలా తలోకరు తలో మాటా అంటున్నారు.

"బామ్మగారూ! బామ్మగారూ! మీ అబ్బాయి సూర్యం అమెరికా నుండి ఫోన్ చేశాడు. మీకు సారీ చెప్పమని మా తాతకి చెప్పాడు ఫోనులో! మా తాత మీకు చెప్పి రమ్మన్నాడు" అని తుర్రున పారిపోయాడు.

సారీ! తనలో తనే పేలవంగా నవ్వుకుంది కామేశ్వరమ్మ.






"అమ్మని ఎవరు తీసుకువెళతారు?" మొదలైంది చర్చ. నాన్నగారి కర్మకాండపై రెండో చర్చ. తరువాత నాలుగోవాడు సూర్యం అమెరికా నుంచి ఫోను చెయ్యటం.. సారీ చెప్పటం... ఇవన్నీ ఆలోచిస్తున్న ఆవిడ మనసంతా అల్లకల్లోలంగా మారింది.

ఒక్కసారి గోడ పక్క నుండి వత్తిగిల్లి పడుకుంది. పమిట చాటున భద్రంగా దాచిన మంగళసూత్రాలు ఒక్కమాటు నేల మీద పడ్డాయి. వాటిని తీసి కళ్లకద్దుకుంది కామేశ్వరమ్మ.

తళతళ మెరిసే అత్తగారి మంగళసూత్రాలను చూసిన కోడలు మనస్సులో తళుక్కుమని మెరిసింది ఆలోచన.

అంతలో అనేసింది 'ఆ మంగళ సూత్రాలు.. ఎలాగూ తీసేవే కదా ! వాటిని అమ్మితే ఆయన ఖర్చులకి వాడుకోవచ్చు" అన్నది కూతురు.

"చెల్లీ !" అని పెద్దగా అరిచాడు మూర్తి. తల్లి నిద్రపోయిందో, లేదో అని తొంగి చూశాడు తల్లి ముఖంలోకి. అమ్మ ఆ మాటలు వింటే ఎంత బాధపడుతుందో కదా అనుకున్నాడు మూర్తి.

చిన్నప్పుడు ఆ మంగళ సూత్రాలు గురించి ఎన్నో కథలు చెప్పేది అమ్మ తులం తులం దాచి దాచి తాతయ్య ఆ మంగళసూత్రాలు చేయించారని అమ్మ గర్వంగా చెప్పుకొనేది ! వాటిని అమ్మటమే ! అమ్మకూడదు. వాటిని పూజ గదిలో పెట్టి పూజించాలి. మూర్తి, మనసులో అనుకున్నాడు.

పరమేశ్వరంగారు బ్రతికి ఉన్నప్పుడు ఏం తిన్నా... ఏం తాగినా.. సగం భార్యకు ఇచ్చేవారు. 'కావుడూ ! నీ కెవరు పెడ్తారు చెప్పు. నాకంటే కనిపెట్టి అన్ని నువ్వే చేస్తావు. అయినా పత్నీ భాగం ఉంచాలని పెద్దలనే వారు. అని సరదాగా చెప్పేవారు. ఇప్పుడు పోతూ పోతూ కూడా "పత్నీ భాగం"గా మిగిల్చారు. డాక్టరు ఇచ్చిన నిద్రమాత్రలు.

అందరినీ ఒక్కసారి చూసుకుంది ఆమె. కొంగునున్న మాత్రల ముడి మెల్లిగా విప్పింది. సన్నగా మూలుగుతూ గోడ పక్కగా ఒరిగిపోయింది. పక్కకు ఒరిగి పడుకున్న కామేశ్వరమ్మ గురించి సాయంత్రం వరకూ ఎవరూ పట్టించుకోలేదు. మూర్తి బయటినుంచి వచ్చి "అమ్మా ! అమ్మా !" అని పిలిచాడు. అమ్మ చేతిలో ఉన్న కాగితం తీసి చూశాడు. మీ నాన్నగారు పోతే నా మంగళసూత్రాలు అమ్మి ఖర్మ చేస్తాం అన్నారు. మరి నా ఖర్మకాండకి ఏం అమ్ముతారు? మీ నాన్నగారి కాష్టం చల్లారేవరకూ నాకు వైధవ్యప్రాప్తి లేదు. ఈలోపుగానే నేను పోతున్నాను. మీకు ఖర్చులు కలిసి వస్తాయి. ఎవరు ఎవర్నీ భరించనక్కర్లేదు. అందరికీ ఆశీస్సులతో మీ అమ్మ అని రాసింది ఆ ఉత్తరంలో ఆమె చుట్టూ పూలు జల్లినట్లు నిద్రమాత్రల ప్యాకింగ్ ముక్కలు ఉన్నాయి.

"అమ్మా !" అని గట్టిగా అరిచాడు మూర్తి. బావురుమన్నాడు.


## రూ. 2,50,000/-ల విలువైన బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

**ప్రత్యేక బహుమతి:** హీరోహోండా మోటార్ సైకిల్ (లేదా) చేతక్ స్కూటర్, కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

**కన్సొలేషన్ బహుమతులు:**
'మ్యూచువల్ బెనిఫిట్ పథకము క్రింద కెమేరా, టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, శారీస్, రిస్ట్‌వాచ్.

పై ఉదాహరణ ప్రకారం పోస్ట్‌కార్డ్/ ఇన్‌ల్యాండ్/ ఎన్వలప్‌పై 9 గడులను రూపొందించండి. 6 నుండి 14 వరకు గల అంకెలను వాడండి. అడ్డముగా, నిలువుగా, ఏటవాలుగా ఎటు కూడినా మొత్తం 30 రావాలి.
ఒక అంకెను ఒక్కసారి మాత్రమే వాడాలి. మీ ఎంట్రీలను పోస్ట్‌కార్డ్/ ఇన్‌లాండ్/ ఎన్వలప్‌పై వ్రాసి 10 రోజులలోగా చేరులా ఆర్డినరీ పోస్ట్ ద్వారా పంపండి. ముందుగా చేరిన 10 ఎంట్రీలకు టైటన్ వాచ్ గోల్డ్‌చైన్ బహూకరించబడును.

**SANDEEP TRADERS** (AJSV),
Post Box No. 14, NEW DELHI-110 008